క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి సన్మానం



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఉన్నం ప్రసాద్‌కు విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో గుర్రం జాషువా అంతర్జాతీయ సాహిత్య సేవా సంస్థ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ప్రసాద్‌ను సన్మానించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పెద్దేటి యోహాన్ మాట్లాడుతూ ప్రసాద్ సేవలు గుర్తించి, తమ సంస్థ తరుపున సత్కరించి, అవార్డు ప్రదానం చేయడం జరిగిందన్నారు. హెచ్ఎం కసుకుర్తి భాస్కరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు



తాడేపల్లి రూరల్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సీతానగరం తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వృద్ధుల ఆరోగ్య సంరక్షణపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ అనూష మాట్లాడుతూ వృద్ధులకు బీపీ, షుగర్, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, సీహెచ్ఓ, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన



ఫిరంగిపురం: గత నెల 28 నుంచి 30 వరకు 68వ అండర్ -17 స్టేట్ పుట్ బాల్ పోటీలు వినుకొండలో నిర్వహించారు. ఫిరంగిపురం సెయింట్ ఆన్స్ స్కూల్ పదో తరగతి విద్యార్థి షేక్ సోహెల్ తన్వీర్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. మూడోస్థానంలో నిలిచిన జట్టు క్రీడాకారుడు సోహెల్‌కు సర్టిఫికెట్, మొమెంటో, పాఠశాలకు మొమెంటోను అందజేశారు. పాఠశాలలో మంగళవారం క్రీడాకారుడిని హెచ్ఎం సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలామేరి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ వేళాంగిణి రెడ్డి, ఉపాధ్యాయులు వెళాంగిణి, షాహిదా, ఎలిబిజెత్ రాణి, జ్యోతి, అనిల్ తేజలు పాల్గొన్నారు.

నిర్మల్ హృదయ్‌లో అన్నదానం



ఫిరంగిపురం: అనాథలను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మార్నెళ్ల నిమ్మవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని నిర్మల్ హృదయ్ అనాథ సేవా ఆశ్రమంలో రేపూడి గ్రామానికి చెందిన మార్నెళ్ల వెంకటేశ్వర రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు, పిల్లలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఎం.నిమ్మవర్ధన్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌కు వినతి

తాడేపల్లి రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శ పాఠశాల, వసతి గృహాల్లో పనిచేస్తున్న మహిళా వార్డెన్స్‌కు ప్రస్తుతం విడుదల చేసిన రిక్రూట్‌మెంట్‌లో ఆప్కాస్‌లో విలీనం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు ఎం.బాలకాశి, ఎం.రమేష్‌బాబు, ఎస్ఎస్ఏ ఎంప్లాయీస్ రాష్ట్ర కార్యదర్శి విజయ్ మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆయన నివాసంలో కలసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలని మంత్రి నారా లోకేష్‌ను కోరామని తెలిపారు. కేజీబీవీ మోడల్ స్కూల్, హాస్టల్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు పనిభారం తగ్గించాలని, వేతనాలు పెంపుదల చేయాలని వివరించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు అర్ధంతరంగా తొలగిస్తున్నారని, అలా చేయడం వల్ల చిరు ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. మంత్రి నారా లోకేష్ సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు ఈరన్న, రాజు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు

తాడికొండ: భవిత కేంద్రాలలో ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫిజియో థెరపీ వైద్యురాలు డాక్టర్ బి.శిరీష సూచించారు. మంగళవారం తుళ్ళూరు ఎంపీపీ ఎస్ బాపూజీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ వైద్య సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టుకతోనే మెడ నిలపకుండా, కూర్చోకుండా, నడవలేకుండా, నడవలేకుండా ఉన్న పిల్లలకు ఫిజియోథెరపీ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ స్పెషల్ టీర్లు కె.దేవీ ప్రియ, ఆర్.ఉషారాణి పలువురు చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోరుపాలెంలో ఇసుక దందా



తాడికొండ: తుళ్ళూరు మండలం బోరుపాలెంలో తెలుగు తమ్ముళ్ల అనధికారిక ఇసుక దందా కొనసాగుతూనే ఉంది. దీనిపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో రీచ్‌కు వెళ్లే రహదారికి పోలీసులు గండి కొట్టారు. అయితే అప్పటికే ఖాళీ స్థలాల్లో నిల్వ చేసిన స్టాక్‌కు రెక్కలు రావడంతో అక్రమ రవాణా గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతూనే ఉంది. తమపై వచ్చిన అపవాదును తప్పించుకునేందుకు వేసిన ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లడంతో ఎత్తుగడ సక్సెస్ అయింది. నమ్మకంగా ఇసుకను నింపిన ఓ ట్రాక్టరును సమాచారం ఇచ్చి పట్టించడంతో సోమవారం రాత్రి పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సదరు ట్రాక్టరు ఓనర్ మంగళవారం ఠాణాకు చేరుకొని పోలీసులపై విరుచుకుపడటంతో ఎవరికి వారు జారుకోవడం వంతైంది. నాకు ఇసుక నిల్వలు ఇచ్చిన వ్యక్తి ఈ తరలింపులో అందరి అనుమతులు ఉన్నాయి, నీకేం ఇబ్బంది లేదంటే ఇంటి నిర్మాణానికి ఇసుకను తీసుకెళ్లానని బహిరంగంగా అడిగారు. డిపార్టుమెంట్ వల్ల ఇబ్బంది ఏమీ లేదని చెప్పి తన ట్రాక్టరుకు లోడింగ్ చేయించాడని, కానీ లోడింగ్ చేస్తున్న సమయంలోనే పోలీసులు వచ్చి తనను పట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. గృహ అవసరాలకు తీసుకెళుతున్న తనను కావాలనే ఇరికించారని, అసలు దీని వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు, తన ట్రాక్టరుపై కేసు నమోదు చేస్తే తనకు నిల్వను అమ్మి లోడ్ చేసిన వారిపై కూడా కేసు నమోదు చేయాలని కోరడంతో పోలీసులు ఖంగుతిన్నారు. అయితే ఈ వ్యవహారంలో ఇసుక నిల్వ చేసిన యజమానిని తప్పించిన పోలీసులు ఎట్టకేలకు ట్రాక్టరుపై కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

తుళ్ళూరు మండలం బోరుపాలెంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరుపై కేసు నమోదు చేసినట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి ఓ ట్రాక్టరును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో తోట చందన

మేడికొండూరు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలని ఎంపీడీవో తోట చందన అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మంగళవారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. సహాయ కార్మిక అధికారి సుభాని బాల కార్మిక నిషేధ అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఎంపీడీఓ చందన మాట్లాడుతూ బాలకార్మిక నిషేధంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. వ్యాపార రంగాల్లో ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే అధికారులకు తెలియజేయాలన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 24 బాల కార్మికు వ్యవస్థను నిషేధిస్తుందని పేర్కొన్నారు. కార్మిక శాఖ అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి సమాజంలో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తుందని సహాయక కార్మిక అధికారి సుభానీ తెలిపారు. అవగాహన ర్యాలీలో ఎంఈవో హలీం, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం జయప్రద, ఉప్పలూరు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీకి వెళ్తుండగా ప్రమాదం



గాయపడిన మహిళా కానిస్టేబుల్

తాడికొండ: పింఛన్ పంపిణీ కోసం వేకువజామునే బైకుపై వెళుతున్న ఓ మహిళా కానిస్టేబుల్, ఏఎన్ఎంలు ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాలపాలైన ఘటన తాడికొండ మండలం కంతేరు గ్రామంలో జరిగింది. ఇటీవల కొండవీటి వాగుకు వరద ఉప్పొంగడంతో ఎర్రవాగు వద్ద లో లెవల్ చప్టాపై రోడ్డు కోతకు గురై గుంతలు పడింది. అయితే ఇక్కడ తూతూమంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు పత్రికల్లో ప్రచారం చేసుకొని కనీసం తొంగి చూడలేదు. కారణంగా వేకువజామునే పింఛన్ పంపిణీ టెన్షన్‌లో వెళుతున్న సచివాలయ ఏఎన్ఎం, మహిళా కానిస్టేబుళ్ళ పీకల మీదకు వచ్చింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఒకటో తారీఖు పింఛన్ల కోసం ఒత్తిడి చేయడం తగ్గించి సమయం వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారిణికి అభినందన



విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మేడికొండూరు : మండలంలోని కొరప్రాడు జిల్లా పరిషత్ హై స్కూల్ పదో తరగతి విద్యార్థిని ఇంటూరి వాసంతి రాష్ట్ర స్థాయి పుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినికి అభినందన సభ మంగళవారం జిల్లా పరిషత్ హై స్కూల్ కొరప్రాడులో జరిగింది. హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జంపాల రమేష్ కుమార్ మాట్లాడుతూ అండర్ 17 స్కూల్ గేమ్స్ పుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్ జట్టుకు విద్యార్థిని వాసంతి ఎంపికవడం అభినందనీయమన్నారు. సెప్టెంబర్ 28 నుండి 30 వరకు పల్నాడు జిల్లాలోని, వినుకొండ లయోలా పబ్లిక్ స్కూల్లో అండర్ 17 స్కూల్ గేమ్స్ స్టేట్ లెవెల్ పుట్‌బాల్ టోర్నమెంట్‌లో గుంటూరు బాలికల పుట్‌బాల్ జట్టు తరపున వాసంతి పాల్గొని ప్రతిభ కనబరిచింది. ప్రతి ఆధారంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు వెల్లడించారు. ఇంటూరి వాసంతిని, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ కరీముల్లాను స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ శివ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

శతాధిక నాటకకర్త గోపాలరావు చిరస్మరణీయుడు



మాట్లాడుతున్న తన్నీరు శివశంకర్

తెనాలి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకుని అమూల్యమైన నాటకాలను సమాజాలకు అందించి ప్రేక్షకులను చైతన్యానికి దోహదపడిన శతాధిక నాటకకర్త కొడాలి గోపాలరావు చిరస్మరణీయులను పలువురు వక్తలు అన్నారు. రూరల్ మండలం పెదరావూరుకు చెందిన ప్రముఖ నాటక రచయిత కొడాలి గోపాలరావు శతజయంతిని మంగళవారం సాయంత్రం స్థానిక 'ఇస్కఫ్' సమావేశపు హాలులో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు తన్నీరు శివశంకర్ అధ్యక్షత వహించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, నాటకసంస్థ అధ్యక్షుడు చందు సూర్య ప్రసంగించారు. కొడాలి గోపాలరావు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా పెదరావూరు ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ప్రజానాట్యమండలిపై 1950 ప్రాంతంలో నిషేధం విధించటంతో ఆంధ్ర క్రాంతి థియేటర్‌ను స్థాపించి, స్వయంగా రాసిన నాటకాలను గ్రామగ్రామాన ప్రదర్శింపజేశారని చెప్పారు. పలనాటి యుద్ధం, బంగారు కలలు సహా పలు సినిమాలకు సంభాషణలు సమకూర్చారని వివరించారు. తొలుత గోపాలరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

వృద్ధుల చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది దీపక్‌కుమార్

తెనాలిరూరల్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. చెంచుపేటలోని శబరి వృద్ధాలయంలో జరిగిన సదస్సుకు న్యాయవాది జి.దీపక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తమ ఉన్నతికి కారకులైన తల్లిదండ్రుల పట్ల బిడ్డలు బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. దేశంలో పండుటాకులకు కొంత మేర బిడ్డలు, బంధువుల నుంచి వేధింపులు, నిరాదరణ పెరిగిపోతుండడంతో కేంద్రం 2007లో తల్లిదండ్రులు వయోవృద్ధుల రక్షణ పోషణ చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం ప్రతి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటైందని, ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్ అధికారి చైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. బాధిత వృద్ధులకు ఉచితంగా వారి బిడ్డల నుంచి రక్షణ పోషణ కల్పిస్తారని చెప్పారు. బాధితులకు తీర్పు నచ్చకపోతే జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఏర్పడ్డ ట్రిబ్యూనల్‌ను 60 రోజుల్లో ఆశ్రయించి అంతిమ తీర్పుతో న్యాయం పొందవచ్చని సూచించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పర్యవేక్షకుడు షేక్ మహబూబ్, పారా లీగల్ వాలంటీర్ బి. మురళీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతో ఆరోగ్యం

ప్రత్తిపాడు: వృద్ధాప్యంలో మానసిక ప్రశాంతత ఆరోగ్యాన్నిస్తుందని ప్రత్తిపాడు సీహెచ్‌సీ షుగర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ మౌనికరెడ్డి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వృద్ధులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ మౌనిక రెడ్డి మాట్లాడుతూ సహజంగా వయస్సు పెరిగే కొద్దీ వృద్ధుల్లో షుగర్, బీపీ వంటి జబ్బులు వస్తాయన్నారు. ఒత్తిడికి గురవ్వడం, అధికంగా ఆలోచించడం వలన అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ వర్ష మాట్లాడుతూ వృద్ధులు ఏ చిన్న అనారోగ్య సమస్య బారిన పడినా వెంటనే స్థానిక వైద్యులను సంప్రదించాలన్నారు. ఆస్పత్రి డీడీఓ డాక్టర్ అఖిల్ రత్నం మాట్లాడుతూ వృద్ధుల రక్షణకు భారతదేశంలో అనేక చట్టాలున్నాయన్నారు. తల్లిదండ్రులను కంటికిరెప్పలా చూసుకుంటే వృద్ధులు ఆస్పత్రుల చుట్టూ తిరిగే పని ఉండదని చెప్పారు.

వృద్ధులకు ఆరోగ్యంపై అవగాహన



మంగళగిరి: పట్టణంలోని గణపతి నగర్‌లో కల అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం వృద్ధులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష మాట్లాడుతూ ఏజింగ్ విత్ డిగ్నిటి థీమ్ ప్రోగ్రాంలో భాగంగా వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

'చలపతి' కళాశాలకు జాతీయ అవార్డులు

తాడికొండ: న్యూ ఢిల్లీలో ఎడ్యు స్కిల్స్ ఫౌండేషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఎడ్యు స్కిల్స్ కనెక్ట్- 2024 నెక్స్ జెన్ స్కిల్ కాన్క్లేవ్‌లో మోతడక చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జాతీయ స్థాయిలో ఏడు అవార్డులు అందుకుందని కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు తెలిపారు. గత నెలలో న్యూ ఢిల్లీలో నిర్వహించిన ఈ సదస్సులో ఏఐసీటీఈ, ఎడ్యుస్కిల్స్ అందించే ఇంటర్న్‌షిప్‌లు, ఎడ్యుస్కిల్స్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రోగ్రామ్‌కు అద్భుతమైన సహకారం అందించినందుకు గాను ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావుకు సౌత్ జోన్ ప్రిన్సిపల్ ఎక్స్‌లెన్స్ అవార్డు-2024 లభించిందని తెలిపారు. హెచ్‌వోడీ ఎస్ శాంతి ప్రియ, జి.రామచంద్రరావు, డి.లావణ్యలకు ఆండ్రాయిడ్, పాలో, ఆల్టో, ఏడబ్లుస్, బ్లూ ప్రిజం విభాగంలో ఎడ్యుకేటర్ ఎక్స్‌లెన్స్ అవార్డులు-2024కు అందుకున్నట్లు తెలిపారు. ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టిజి సీతారాం, సౌత్ ఏషియన్ యూనివర్శిటీ ప్రెసిడెంట్ కిషన్ అగర్వాల్ ప్రముఖుల చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకుంటున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ పాల్గొన్నారు.

మేయర్స్ హోమ్ సందర్శన

మంగళగిరి: నగర పరిధిలోని తాడేపల్లి డొల్లాస్ నగర్‌లోని మేయర్స్ హోమ్‌ను మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు సందర్శించారు. మేయర్స్ హోమ్‌లోని పిల్లలకు బ్యూటీషియన్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధి టి.లీలావతి హోమ్‌లోని బాధిత పిల్లలకు అందుతున్న సదుపాయాలు, వంటశాల భోజనాన్ని పరిశీలించారు. బాధిత పిల్లలతో ఒక్కక్కరితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు జి ప్రమీల,మేయర్స్ హోమ్ సిస్టర్లు జోషఫ్, సిసిలీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

గుంటూరు రూరల్: సంప్రదాయకమైన చిరుధాన్యాల పంటలతో వంటకాలు ఎంతో రుచిగా మంచి ఆరోగ్యాన్ని అందిస్తాయని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వర రావు తెలిపారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో రైతునేస్తం ఫౌండేషన్‌లో చిరుధాన్యాల వంటకాలపై రైతు, మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల కారణాల వలన మన సంప్రదాయ ఆహారాలు చిరుధాన్యాలను పక్కనపెట్టి వరి, గోధుములు మన ఆహారంలో ప్రధాన భాగంగా చేసుకున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. చిరుధాన్యాలతో పోల్చుకుంటే వరి, గోధుములలో పోషకాలు తక్కువగా ఉంటాయన్నారు. మనం ఆరోగ్యంగా జీవించటానికి అవసరమైన పోషకాలు చిరుధాన్యాలలోనే సమపాళ్ళలో ఉంటాయని వివరించారు.

'స్వచ్ఛత సేవ' ఆకృతిలో విద్యార్థులు



తెనాలి: గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో గత పదిరోజులుగా జరుగుతున్న స్వచ్ఛతాసేవలో భాగంగా మంగళవారం విద్యార్థులతో స్వచ్ఛతా సేవ ఆకృతిని ఏర్పాటుచేశారు. 350 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. విద్యార్థులు 'మహాత్మాగాంధీకి జై' అంటూ నినాదాలు చేశారు. చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్, ఇన్‌ఛార్జి హెచ్ఎం ప్రసూనాదేవి పర్యవేక్షించారు. గాంధీజీని ఆదర్శంగా శుభ్రత, పరిశుభ్రతను పాటించాని పాటించాలని సూచించారు. పీఈటీ శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవ దుర్గమ్మలు



పట్టణంలో టిప్పర్ల బజార్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో మంగళవారం దసరా నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నవ దుర్గ వేషధారణలో అలరించారు. - మంగళగిరి

98.20 శాతం పింఛన్ల పంపిణీ



పెన్షన్ పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్ అలీంబాషా



దుగ్గిరాలలో పెన్షన్ అందజేస్తున్న ఇన్‌ఛార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంగళవారం 98.20 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు నగర కమిషనర్ ఆలీంబాషా తెలిపారు. మొత్తం 13,059 లబ్ధిదారుల్లో 12,857 మందికి రూ 5,56,49,447లు పంపిణీ పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన లబ్ధిదారులకు బుధవారం పంపిణీ పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

పింఛన్ల పంపిణీ

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల గ్రామ పరిధిలోని సచివాలయ సిబ్బందితో కలసి ఇన్‌చార్జి ఎంపీడీఓ పురం శ్రీనివాసరావు మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. పురం శ్రీనివాసరావు మాట్లాడుతూ దుగ్గిరాలలోని 18 గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగిందన్నారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో సామాజిక పెన్షన్ల పంపిణీని కమిషనర్ అలీమ్ బాషా మంగళవారం పరిశీలించారు.

వేములూరిపాడులో 'పొలం పిలుస్తోంది'



పంటను పరిశీలిస్తున్న విజయభారతి, వెంకటేశ్వర్లు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నుంచి సంయుక్త వ్యవసాయ సంచాలకులు విజయభారతి, జిల్లా వ్యవసాయ సంచాలకుడు నున్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పత్తి పంటను ఆశించే గులాబీ రంగు పురుగు నివారణకు నాట్కో కంపెనీ (నటమేట్ పింక్‌బాల్ వామ్ జెల్), చిగురు పదార్థాన్ని వరస మార్చి వరస క్రమంలో 400 మొక్కలకు నెలకు ఒకసారి కాండం పైభాగాన చుక్కలాగా పూయాలని చెప్పారు. ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో వాసంతి, షేక్.సుభాని, ప్రభాకర్, ప్రకృతివ్యవసాయ సిబ్బంది, ఇ.వెంకటేశ్వర్లు, అన్నామణి, అమల, అరుణ, కృష్ణవేణి, గాయత్రి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్ : ఇటీవల వరద ముంపునకు గురైన మహానాడు వరద బాధితులకు మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ సుమారు 700 వరద బాధిత కుటుంబాలకు దుప్పట్లు, టవల్స్ ఉచితంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు ముజఫర్ అహ్మద్, ఉమా మహేశ్వరరావు, నాయకురాలు కె. ధనలక్ష్మి, దయా రమాదేవి, వేముల దుర్గారావు, జొన్న శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, గిరిజ, నార్ని నాగేశ్వరరావు, డి.వి. భాస్కర్‌రెడ్డి, షేక్ బాషా, కె.మేరి పాల్గొన్నారు.

రేపటి నుంచి దసరా శరన్నవరాత్రులు



ఉత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరణ

తెనాలి: స్థానిక దేవీచౌక్‌లో గల శ్రీరాజరాజేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల బ్రోచర్‌ను మంగళ వారం ఆవిష్కరించారు. ఈనెల 3వ తేదీనుంచి 13వ తేదీవరకు జరిగే ఉత్సవాల వివరాలను తెలియజేశారు. తొలిరోజున ఉదయం ఏడు గంటలకు మంగళవాయిద్యాలతో కలశస్థపన జరుగుతుందనీ, అమ్మవారు పదిరోజులు పది అవతారాలుగా భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. 9వ తేదీన మధ్యాహ్నం ఒంటిగంటకు సువాసినులచే లక్ష కుంకుమార్చన, 12వ తేదీ సాయంత్రం కలశోద్వాసన, శమీపజ, అనంతరం రాత్రికి అమ్మవారి రథోత్సవం జరుగుతుందని దేవస్థానం అధ్యక్షుడు టీవీఎస్ శాస్త్రి చెప్పారు. కోశాధికారి దారా బాలకృష్ణ మాట్లాడుతూ నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం ఏడు గంటలకు బాలపూజ, మధ్యాహ్నం ఒంటిగంటకు శ్రీచక్ర అర్చన, రాత్రి ఏడు గంటలకు అమృత ప్రసాద వినియోగం, 13వ తేదీ ఉదయం సత్యనారాయణ వ్రతం, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటాయని వివరించారు. భక్తులంతా ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి విష్ణుభట్ల రత్నాకరశాస్త్రి, ఉపాధ్యక్షుడు చివుకుల శివరామప్రసాద్, సహాయకార్యదర్శి, సభ్యులు జొన్నలగడ్డ సూర్యభగవాన్, పోలేపెద్ది రామకృష్ణ, పూర్ణభాస్కర్, కాజా శివప్రసాద్, కొండపి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ గ్రామ సభలు

చేబ్రోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా బుధవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేబర్ బడ్జెట్ ప్రణాళిక తయారు చేయటం కోసం, వర్క్‌లు, గుర్తించిన పనులను గ్రామ సర్పంచి అధ్యక్షతన జరిగే గ్రామ సభల్లో తెలియజేయనున్నారు. 13 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగే గ్రామ సభలకు ఏపీఓ ఆనంద్, టీఏలు ఎస్.సంపత్, ఎస్.రసూల్, జేఈ బాజి హాజరుకానున్నట్లు చెప్పారు.